ESHAGNA
ఛానల్‌కి సంబంధించిన Pvt Ltd ( Broadcasting ), MSME , Trademark , Food License (Fssai) , ISI License , RNI , Trust (12A-80G), రిజిష్ట్రేషన్ చేయబడును
RTMP సర్వర్ KEY, E పేపర్ వెబ్సైట్, న్యూస్ వెబ్సైట్ చేయబడును.

Registered No : APTEL/25/A1201

# గాయత్రి వార్తలు

జాతీయ తెలుగు దిన పత్రిక

విలేకరులు కావలెను
గాయత్రి వార్తలు జాతీయ తెలుగు దినపత్రికలో ఆంధ్ర ప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలోని అన్ని నియోజకవర్గ, మండల కేంద్రాలలో పనిచేయుటకు ఆసక్తి గల విలేకరులు కావలెను. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
యం. నాగేశ్వర రావు
ఎడిటర్ గాయత్రి వార్తలు
సెల్ : 73860 45673

PUBLISHED FROM : DELHI - MAHARASHTRA - ANDHRA PRADESH - TELANGANA - KARNATAKA - TAMILANADU - GOA - LOCKNOW - EDITOR : M. NAGESWARARAO

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్ మంగళవారం 24-03-2026 సంపుటి : 1 సంచిక :275 ఎడిటర్ : యం నాగేశ్వరరావు పేజీలు : 4 వెల రు : 2/-

# భారత్ చేరిన అమెరికా ఎల్‌పీజీ నౌక




- సరఫరా అంతరాయం: పశ్చిమాసియాలో ఉద్రిక్తతల వల్ల దేశంలో చమురు, ఎల్‌పీజీ (వ్రా+) సరఫరా గొలుసుకు ఆటంకం ఏర్పడి కొరత తలెత్తింది.
- అమెరికా నుంచి ఎల్‌పీజీ: భారత్‌కు ఊరటనిస్తూ అమెరికాలోని టెక్సాస్ నుంచి 'పయనీర్' అనే ఎల్‌పీజీ నౌక ఆదివారం కర్ణాటకలోని మంగళూరు పోర్టుకు చేరుకుంది.

పశ్చిమాసియా సంక్షోభం కారణంగా చమురు, ఎల్‌పీజీ సరఫరా గొలుసుకు అంతరాయం ఏర్పడింది. దీంతో దేశంలో ముఖ్యంగా ఎల్‌పీజీకి కొరత ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో భారత్‌కు ఊరటనిచ్చేలా అమెరికాకు చెందిన ఎల్‌పీజీ నౌక భారత్‌కు చేరింది. అమెరికాలోని టెక్సాస్ నుంచి బయల్దేరిన పయనీర్ నౌక ఎల్‌పీజీ లోడ్‌తో కర్ణాటకలోని మంగళూరు పోర్టుకు ఆదివారం చేరుకుంది. దీంతోపాటు రష్యాకు చెందిన చమురు నౌక కూడా దేశ సముద్రజలాల్లోకి ప్రవేశించింది. అక్వాటైటాన్ పేరుతో రష్యా నుంచి వచ్చిన ఈ నౌక శనివారమే మంగళూరు పోర్టును చేరినట్లు పలు ఆంగ్ల మీడియా సంస్థలు పేర్కొన్నాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతల కారణంగా చమురు సంక్షోభాన్ని తగ్గించడమే లక్ష్యంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మార్చి 12 నాటికి రష్యా నౌకల్లో లోడ్ చేసిన చమురును కొనుగోలు చేయొచ్చని అనుమతి ఇచ్చారు. ఈ నేపథ్యంలో రష్యా నౌక భారత్‌కు చేరుకోవడం గమనార్హం. పేజి 2లో ▶

# ఉద్రిక్తతల వేళ..

## కీలక భేటీ నిర్వహించనున్న ప్రధాని మోదీ



- కీలక భేటీ: పశ్చిమాసియా ఉద్రిక్తతల దృష్ట్యా ఇంధన కొరత తలెత్తకుండా ప్రధాని మోదీ సీనియర్ మంత్రులతో అత్యవసర సమావేశం నిర్వహించనున్నారు.
- ప్రధాన రంగాలు: ముఖ్యంగా పెట్రోలియం, ఎరువులు, మరియు విద్యుత్ రంగాలకు చెందిన మంత్రులతో ఈ సమీక్ష జరగనుంది.

పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న వేళ ప్రధాని మోదీ సీనియర్ మంత్రులతో కీలక భేటీ నిర్వహించనున్నారు. ముఖ్యంగా పెట్రోలియం, ఎరువులు, విద్యుత్ రంగాలకు చెందిన మంత్రులతో సమీక్ష జరపనున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. దేశవ్యాప్తంగా ఇంధనం నిరంతరాయంగా సరఫరా చేయడం, సరకు రవాణాలో ఇబ్బందులు లేకుండా చూడటమే ఈ సమావేశం ప్రధాన ఉద్దేశమని తెలిపాయి. వినియోగదారులు, పరిశ్రమల ప్రయోజనాలను కాపాడేందుకు కేంద్రం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. పశ్చిమాసియాలో యుద్ధం ప్రపంచ ఇంధన సంక్షోభానికి దారితీసిందని ప్రధాని మోదీ ఇటీవల పేర్కొన్న విషయం తెలిసిందే. ఇది భారత్‌కు ఓ కీలక పరీక్షగా మారిందని.. శాంతి, సహనంతో ఈ పరిస్థితులను ఎదుర్కోవాలని అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ సరఫరా గొలుసులో ఏర్పడిన అంతరాయాలను పరిష్కరించేందుకు తమ ప్రభుత్వం అన్నివిధాలా కృషి చేస్తోందన్నారు.

## ఆర్సెల్లార్ మిత్తల్ స్టీల్‌ప్లాంట్..

### ఉత్తరాంధ్రకు మరో మణిహారం: కలిశెట్టి



2లో..

## లారీని ఢీకొట్టిన కారు.. భార్యాభర్తలు మృతి



2లో..

# స్టీల్ ప్లాంట్‌కి కాదు.. స్టీల్ సిటీకి పునాది వేశాం

- చంద్రబాబు వల్లే పెట్టుబడులు సాధ్యం: పవన్ కల్యాణ్
- ఏపీ శరవేగంగా దూసుకుపోతోంది: కుమారస్వామి
- ఉత్తరాంధ్రలోని నక్కపల్లిలో కొత్తచరిత్ర లిఖిస్తున్నామని సీఎం చంద్రబాబు అన్నారు.
- విశాఖ ఉక్కు పరిశ్రమకంటే.. అతిపెద్ద పరిశ్రమ రాజయ్యపేటలో ఏర్పాటు కాబోతోందన్నారు.
- ఆర్సెలార్ మిత్తల్ స్టీల్‌ప్లాంట్‌కు శంకుస్థాపన సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో చంద్రబాబు ప్రసంగించారు.
- ఆర్సెలార్ మిత్తల్ పెట్టుబడిని గొప్ప మలుపుగా అభివర్ణించారు.



" భారత్‌లోనే అతిపెద్ద స్టీల్‌ప్లాంట్ నక్కపల్లిలో ఏర్పాటు కాబోతోంది. ప్రపంచంలోనే నెంబర్‌వన్ ఉక్కు పరిశ్రమగా ఆర్సెలార్ మిత్తల్ స్టీల్‌ప్లాంట్ కాబోతోంది. కేంద్రం సహకారం ఉండటం వల్లే ఈ ప్లాంట్ సాధ్యమవుతోంది. రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చాం. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన చేస్తామని హామీ ఇచ్చాం. ఇచ్చిన హామీలను 20 నెలల్లో పూర్తి చేశాం. ఏ పని తలపెట్టినా బేషరతుగా మద్దతిస్తున్న పవన్ కల్యాణ్‌కు ధన్యవాదాలు. ఈ ప్రాజెక్టు తీసుకొచ్చేందుకు ప్రణాళికాబద్ధంగా పని చేసిన లోకేశ్‌కు అభినందనలు. 5,465 ఎకరాల్లో ఆర్సెలార్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కాబోతోంది. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి లభిస్తుంది. ఈ ప్రాజెక్టును రెండు దశల్లో పూర్తి చేస్తాం. ఇవాళ స్టీల్‌ప్లాంట్‌కే కాదు.. స్టీల్ సిటీకి పునాది వేశాం. 2028 డిసెంబర్ నుంచి స్టీల్ ఉత్పత్తి ప్రారంభమవుతుంది. ఈ ప్లాంట్ ద్వారా ఈ ప్రాంత రూపురేఖలే మారిపోతాయి. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వైపు వెళ్తున్నాం. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా రికార్డు స్థాయిలో భూ సేకరణ చేశాం. దేశంలోనే పెట్టుబడులకు ఏపీ గమ్యస్థానం. ఏపీలో ఉన్నన్ని వనరులు ఎక్కడా లేవు. అద్భుత విజయాలకు పెట్టుబడిదారులు ఏపీని కేంద్రంగా చేసుకోవాలి.

## మమత కంచుకోట.. ఒకప్పుడు కాంగ్రెస్‌దే హవా!



పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికల హడావుడి నెలకొంది. ఈ క్రమంలోనే భవానీపూర్ నియోజకవర్గం అందరి దృష్టి ఆకర్షిస్తోంది. పేజి 2లో ▶

## పాలనలో.. మోదీ రికార్డు



# పోలవరం ఎమ్మెల్యేను బురిడీ కొట్టించిన సైబర్ నేరగాళ్లు



పోలవరం: ఏపీలోని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజును సైబర్ నేరగాళ్లు బురిడీ కొట్టించారు. ఆయన బ్యాంకు అకౌంట్ నుంచి రూ.12 లక్షలు కాజేశారు. ఆర్టీఏ చలానా పేరుతో వచ్చిన లింక్‌ను ఎమ్మెల్యే క్లిక్ చేశారు. దీంతో బ్యాంకు ఖాతాలోని నగదు మాయమైంది. మోసపోయినట్లు గ్రహించిన ఎమ్మెల్యే బాలరాజు.. జీలుగుమిల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

## హైదరాబాద్‌లో బాల్కనీ స్లాబ్ కూలి ఇద్దరి మృతి



పంజాగుట్ట: బాల్కనీ స్లాబ్ కూలి ఇద్దరు మృతిచెందిన ఘటన పంజాగుట్ట పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సీతారాంబాగ్‌కు చెందిన దేవీదాస్ (56), అతడి అల్లుడు వరుసైన వివేక్ (32)లు ఎలక్ట్రిషియన్‌గా పనిచేస్తున్నారు.

## మాట్లాడే దమ్ము ధైర్యం లేదా జగన్?

మాజీ మంత్రి వివేకా హత్య కేసును ప్రస్తావిస్తే.. ఆస్తుల గురించి మాట్లాడుతున్నారని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల మండిపడ్డారు. ఇంకొకరి ఆస్తిని అనుభవిస్తోంది తాను కాదని, జగన్ అని చెప్పారు. " నా పోరాటం, అజెండా ఆస్తులు కాదు. ఆస్తులే నా అజెండా అయితే ఎప్పుడో కోర్టుకు వెళ్లేదానిని. ఆస్తులపై నా తల్లి



విజయమ్మ స్పష్టత ఇచ్చారు. లేఖ ద్వారా వాస్తవాలు చెప్పారు. స్పష్టత ఇచ్చినా వైకాపా నేతలు మొరుగుతున్నారు. విజయమ్మ విడుదల చేసిన లేఖ నిజం కాదని చెబుతున్నారు.

# ప్రతి నీటి బొట్టునూ సంరక్షించుకుందాం

- ప్రతి నీటి బొట్టునూ సంరక్షించుకుని భవిష్యత్తును కాపాడుకుందామని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పిలుపునిచ్చారు.
- నీటి ప్రాముఖ్యతను గుర్తించి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు.
- ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా ఆదివారం ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు.



నీటి ప్రాధాన్యాన్ని తెలియజెబుతూ జలజీవన్ మిషన్, ఉపాధి హామీ పథకాల కింద రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న జల సంరక్షణ కార్యక్రమాలు, తాగునీటి ప్రాజెక్టుల పనులను వివరించారు. 'గత 20 నెలల్లో ఒక టీఎంసీ నీటి నిల్వ సామర్థ్యం గల 1,06,788 వ్యవసాయ కుంటలు, 13,500 పశువుల తొట్టెలను నిర్మించాం. 1.46 కోట్ల జనాభాకు లబ్ధి చేకూరేలా రూ.9,441 కోట్లతో 8 మల్టీ విలేజ్ నీటి పథకాల పనులు చేపట్టాం. రూ.9,355 కోట్లతో త్వరలో మరో ఏడు మల్టీ విలేజ్ పథకాల పనులు ప్రారంభం కానున్నాయి. తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్న మరో 3 వేల గ్రామాల్లో 38.54 లక్షల జనాభాకు లబ్ధి చేకూరేలా రూ.1,814.71 కోట్లతో పనులు చేపట్టనున్నాం' అని ఉపముఖ్యమంత్రి పేర్కొన్నారు.

# సంపాదకీయం

## పశ్చిమాసియా సంక్షోభంలో మహాపరాధులు

'మానవ వ్యవహారాలలో దుష్టశక్తుల పాత్రపై మీరు మరి కొంచెం ఎక్కువగా ఆలోచించాలి...'-- ఇటీవల కీర్తిశేషుడు అయిన ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త ఆంద్రే బెటీల్ ఒక వ్యక్తిగత లేఖలో నాకు అలా సూచించారు. నేను నా రచనా వ్యాసంగంలో గాంధీ లాంటి సజ్జనులు, సత్ సంకల్పుల మీదనే దృష్టిని కేంద్రీకరిస్తున్నానని ఆయన భావించారు. అయితే సజ్జనుల కంటే ఎక్కువగా చరిత్రను దుష్టస్వభావులే సృష్టిస్తున్నారు, నిర్మూలిస్తున్నారు. ఇది నిజం. పశ్చిమాసియాలో ప్రస్తుత యుద్ధం ప్రజ్వరిల్లినప్పుడు ప్రొఫెసర్ బెటీల్ సూచన నాకు జ్ఞప్తికి వచ్చింది. ఈ యుద్ధంలో అమెరికా, ఇజ్రాయెల్ కలిసికట్టుగా ఇరాన్‌పై పోరాడుతున్నాయి. ఈ వినాశనకర ఘర్షణకు ప్రధాన కారకులైన ఆ మూడు దేశాల నాయకుల వ్యక్తిత్వాలను యుద్ధం ఎలా సువ్యక్తం చేసిందో నిశితంగా పరిశీలించడం చాలా ముఖ్యం.

తొలుత, యుద్ధం తొలిరోజునే మరణించిన ఇరాన్ అధినేత అయతొల్లా ఖమేనీ విషయాన్ని చూద్దాం. బాంబుల వర్షం కురుస్తున్నా సురక్షిత ప్రదేశానికి వెళ్లడానికి ఖమేనీ నిరాకరించాడు. ఉద్దేశపూర్వకంగా మరణాన్ని ఆహ్వానించాడు. తన అంతిమ రోజుల్లో ఖమేనీ ప్రదర్శించిన ధైర్యం ఆయన నైతిక ఉన్నతికి తార్కాణం. ఈ కారణంగా ఖమేనీని సామ్రాజ్యవాద వ్యతిరేక యోధుడుగా వామపక్ష మేధావులు కొంతమంది కీర్తిస్తున్నారు. ఖమేనీ వీరోచితంగా మరణించాడు, సందేహం లేదు. అయితే ఇది, ఆయన సజీవుడుగా ఉన్నప్పుడు తన అపార అధికారాలను ఏ విధంగా ఉపయోగించారు అన్న వాస్తవాన్ని అస్పష్టపరచకూడదు.

ఇరాన్ సర్వాధినేతగా ఖమేనీ ముందు మూడు మార్గాలు ఉన్నాయి. అవి, తన ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలకు ప్రతిస్పందించి, రాజకీయ ప్రక్రియల నుంచి మతాచార్యులను ఉపసంహరించి, స్వేచ్ఛాయుత సమాజాన్ని అభివృద్ధిపరచడం. మహిళలపై విధించిన అన్ని ఆంక్షలను తొలగించి దేశ ఆర్థిక, సామాజిక, రాజకీయ జీవితంలో వారిని పూర్తిగా భాగస్వాములను చేసి ఉండవలిసింది. ఒమన్, ఖతార్, సౌదీ అరేబియా తదితర గల్ఫ్ దేశాలకు ఉన్నట్టుగానే ఇరాన్‌కు అపార చమురు నిక్షేపాలు ఉన్నాయి. ఆ దేశాలలో లేని విధంగా ఇరాన్‌లో విద్యాధికులు అధికంగా ఉన్నారు. 1979 ఇస్లామిక్ విప్లవానికి ముందు కాలంలో ఇరానియన్ మహిళలు విద్యారంగంలోనూ, వివిధ వృత్తులలోను కీలక బాధ్యతలు నిర్వహిస్తూ ఉండేవారు. గల్ఫ్ దేశాలకు లేని సమున్నత సాంస్కృతిక చరిత్ర ఇరాన్‌కు ఉన్నది. పురాతన నాగరికతకు నెలవైన ఇరాన్ నుంచి చాలామంది సుప్రసిద్ధ తాత్వికులు, మహాకవులు, సంగీతవేత్తలు ప్రభవించారు. సంపద్వంతమైన స్వావలంబన ఇరాన్‌ను నిర్మించేందుకు ఆ సముదాత్త చరిత్రను ఖమేనీ ఉపయోగించుకుని ఉండవల్సింది.

అధికారంలో ఉన్న సుదీర్ఘకాలంలో ఆర్థికాభివృద్ధితో పాటు ప్రజాస్వామ్యాన్ని పెంపొందించేందుకు ఖమేనీ కృషిచేసి ఉండవల్సింది. లేదూ, సింగపూర్ తరహాలో ప్రజాస్వామ్య పురోగతిని ఉపేక్షించి ఆర్థికాభివృద్ధికి ప్రాధాన్యమిచ్చి ఉండవలిసింది. అయితే ఈ రెండు మార్గాలకు భిన్నంగా ఖమేనీ పాలన మూడో మార్గాన్ని అనుసరించింది. స్వదేశంలో ప్రజలపై తీవ్ర అణచివేత విధానాలను అమలుపరిచింది. వైదేశిక నీతిలో విస్తరణవాదానికి ప్రాధాన్యమిచ్చింది. లెబనాన్, యెమెన్‌లో తనకు అనుకూలంగా ఉండే సాయుధ బృందాలను ప్రోత్సహించింది. సిరియాలో అస్సాద్ క్రూరపాలనకు మద్దతునిచ్చింది. తద్వారా ఆ దేశాలు అతలాకుతలమవడంలో కీలక పాత్ర వహించింది. మరీ ముఖ్యంగా ఖమేనీ నేతృత్వంలో ఇరాన్ దురహంకారపూరితంగా ఇస్లామిక్ ప్రపంచానికి తననుతాను నాయకుడుగా నిర్దేశించుకున్నది. యూదు రాజ్యమైన ఇజ్రాయెల్ పట్ల వ్యతిరేకతను ప్రదర్శించింది.

ఇజ్రాయెల్‌ను సుదీర్ఘకాలంగా పరిపాలిస్తున్న బెంజమిన్ నెతన్యాహు సైతం ఖమేనీ వలే మత తీవ్రవాది. ఎటువంటి దయాదాక్షిణ్యాలు లేకుండా వ్యవహరించే వ్యక్తి. కుటుంబ నేపథ్యమే నెతన్యాహును యూదు మత తీవ్రవాదిగా మార్చింది. తండ్రి కరడుగట్టిన మితవాద యూదు చరిత్రకారుడు. సైనికాధికారిగా ఉన్న సోదరుడు 1976లో ఉగ్రవాదుల చెర నుంచి ఇజ్రాయెలీలను విడిపించడంలో ప్రాణాలు కోల్పోయిన వీరుడు. ప్రధానమంత్రిగా నెతన్యాహు, పాలస్తీనియన్లకు స్వతంత్ర దేశం ఏర్పాటును ఎటువంటి మినహాయింపులు లేకుండా వ్యతిరేకిస్తూ వస్తున్నారు. పాలస్తీనియన్ అథారిటీ పట్ల అతడి అణువణువులో అపార ద్వేషమున్నది. ఆ సంస్థ ప్రాబల్యాన్ని తగ్గించేందుకు ఒక దశలో హమాస్‌కు సైతం అతడు మద్దతునిచ్చాడు. అక్టోబర్ 2023లో ఇజ్రాయెల్‌పై హమాస్ దాడికి నెతన్యాహు చాలా పైశాచికంగా ప్రతిస్పందించాడు. ఇజ్రాయెల్ సైన్యం గాజాలో 75 వేల మందికి పైగా పౌరులను హతమార్చింది. లక్షలాది ఇజ్రాయెలీలను నిరాశ్రయులను చేసింది. ఈ చర్యలకుగాను అంతర్జాతీయ నేర విచారణ న్యాయస్థానం నెతన్యాహుపై యుద్ధ నేరస్థుడుగా అభియోగం మోపింది. నిజానికి అతడిని ఆ విధంగానే పరిగణించితీరాలి. నెతన్యాహు, ఆయన కుటుంబ సభ్యులపై అనేక అవినీతి ఆరోపణలు ఉన్నాయి. అధికారంలో కొనసాగాలంటే వాటి అడ్డు తొలగించుకోవాలి. అందుకే ఇరాన్‌కు వ్యతిరేకంగా యుద్ధాన్ని ప్రేరేపించి, కొనసాగిస్తున్నాడని నెతన్యాహును పలువురు నిందిస్తున్నారు.

పశ్చిమాసియా యుద్ధంలో మూడో ప్రధాన వ్యక్తి డోనాల్డ్ ట్రంప్ విషయమేమిటి? అధికార లాలసే ఈయననూ నడిపిస్తున్నది. క్రైస్తవ ధర్మాన్ని పరిపూర్ణంగా అనుసరించే వ్యక్తినని ట్రంప్ చెప్పుకుంటాడు. అయితే ఆ ధర్మం నిర్దేశించిన దివ్య ప్రవర్తనా నియమావళిని ఈ మహాశయుడు పాటించడు. ఈ శతాబ్ది మొదటి దశకంలో డెమొక్రాటిక్ పార్టీ సభ్యుడుగా ఉన్న ట్రంప్ ఆ తరువాత 2016లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా అమెరికా అధ్యక్షపదవికి ఎన్నికయ్యాడు. 2024లో యుద్ధ వ్యతిరేకత నినాదంతో రెండోసారి అధికారంలోకి వచ్చిన ట్రంప్ నైజీరియా, సోమాలియాలపై బాంబు దాడులకు ఆదేశించాడు. వెనెజువెలా అధ్యక్షుడిని కిడ్నాప్ చేసి అమెరికా జైలులో నిర్బంధించాడు.

ఆ తరువాత ఇరాన్‌పై పెద్ద ఎత్తున సైనిక దాడులు ప్రారంభించాడు. వీటిలో ఏ ఒక్క దేశం నుంచి కూడా అమెరికాకు వాటిల్లే ముప్పు ఏమీ లేదు. శాంతి ప్రియుడినని చెప్పుకున్న ట్రంప్ యుద్ధోన్మాదిగా వ్యవహరిస్తున్నాడు. ట్రంప్ సైద్ధాంతిక వ్యక్తి కాదు. అతడి నిర్ణయాలకు, చర్యలకు మార్గనిర్దేశం చేసేది స్వప్రయోజనాలే. అధికారలాలసతో పాటు అతడిని ఉత్సాహపరిచేవి దురాశ, అహంకారాలే. ఇరాన్‌పై ప్రస్తుత అమానుష దాడిని అమెరికా ఎందుకు ప్రారంభించింది అనే దానికి సహేతుక, తార్కిక, విశ్వసనీయ కారణాలను కనుగొనడం కష్టం. ఇరాన్‌పై యుద్ధానికి వెళ్లడాన్ని ట్రంప్ సమర్థించుకుంటూ, ఆయన తడవకో కారణం చెబుతున్నాడు. అవి పరస్పర విరుద్ధంగా ఉంటున్నాయి. నిజమైన కారణాలు ఏమై ఉండవచ్చు? వీటిపై అనేక ఊహాగానాలు. బరాక్ ఒబామా ప్రభుత్వం ఒసామా బిన్ లాడెన్‌ను తుదముట్టించి అమెరికా ప్రజల మెప్పు పొందినట్టే, ఖమేనీని హతమార్చి, స్వదేశీయుల నుంచి మరింత ఘనమైన ప్రశంసలు పొందాలనే ఆకాంక్షే ఈ యుద్ధానికి ట్రంప్‌ను ప్రేరేపించిందన్నది నేను విన్న ఆ ఊహాగానాలలో ఒకటి. గాజాలో ఒక 'రివియెరా' (సముద్ర తీరంలో విలాసవంతమైన పర్యాటక కేంద్రం)ను అభివృద్ధిపరచడం ద్వారా కుటుంబ సిరి సంపదలను ఇతోధికంగా పెంపొందించుకోవాలనే పేరాశతోనే ఇరాన్‌కు వ్యతిరేకంగా, నెతన్యాహు అభీష్టాన్ని నెరవేర్చేందుకు ట్రంప్ సమ్మతించాడని మరి కొందరు వాదిస్తున్నారు. ఇరాన్‌కు వాటిల్లే భారీ విధ్వంసం, ఇరానియన్ల అష్టకష్టాలు చూసి ఆనందించాలనే దుగ్ధ ఉండవచ్చు. ఇరాన్ చమురు నిక్షేపాలు, పెట్రోలియం ఉత్పత్తుల సదుపాయాలను స్వాధీనం చేసుకుని వాటిని తన ఆశ్రితులకు అప్పగించడం మరో లక్ష్యం.

దురహంకారం, దురాశల హానికరమైన కలయికతోనే ఇరాన్‌కు వ్యతిరేకంగా భయంకరమైన యుద్ధానికి ట్రంప్ ఆదేశించారు. పోటెత్తిన ఈ దౌష్ట్యానికి ఖమేనీ ప్రభుత్వాన్ని సమర్థిస్తున్న వారితో పాటు వ్యతిరేకిస్తున్న ఇరానియన్లు కూడా ఒకేరీతిలో నలిగిపోతున్నారు. నివాస ప్రదేశాలు, దుకాణాలు, కార్యాలయాలు, చరిత్రాత్మక భవనాలు, సాంస్కృతిక కేంద్రాలపై విచక్షణారహిత భయానక దాడులలో వేలాది ఇరానియన్లు హతమయ్యారు. లక్షల సంఖ్యలో అమాయకులు నిరాశ్రయులయ్యారు. లెబనాన్ లోని పలు పట్టణాలపై ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో లక్షలాది ప్రజలు అప్పులు, ఆస్తులు కోల్పోయి అల్లాడిపోతున్నారు. పశ్చిమాసియా సమస్తం అతలాకుతలమైపోతోంది. చమురు మార్కెట్లు ఇప్పటికే కుదేలయిపోయాయి. ప్రచ్ఛన్న యుద్ధం ముగిసిన తరువాత సంభవించిన అతిపెద్ద ప్రపంచ సంక్షోభమే ఇరాన్‌పై అమెరికా-- ఇజ్రాయెల్ యుద్ధం.

ఈ భయంకర సంఘర్షణను ప్రారంభించిన, ఎగదోస్తున్న వారిలో మంచి మనుషులు ఎవరూ లేరు. ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా నాయకులు అందరూ పాపకర్ములే. అమాయకులను నిర్దయగా హతమార్చేందుకు, ఎదుటి పక్షం వారి బతుకులను నరకప్రాయం చేసేందుకు వెనుకాడని దుష్టులే.

# పాలనలో.. మోదీ రికార్డు

మొదటిపేజీ తరువాయి

తన రాజకీయ జీవితంలో ప్రధాని మోదీ (గ్రావీ చీఖితీవఅతీఖ వీశీఒఱ) మరో అరుదైన మైలురాయిని చేరుకున్నారు. 8,931 రోజుల పాటు (గుజరాత్ సీఎం పదవీకాలం సహా) ఎలాంటి విరామం లేకుండా దేశంలో సుదీర్ఘకాలం ప్రభుత్వ అధిపతిగా పనిచేసిన వ్యక్తిగా నిలిచారు. ఇప్పటి వరకు సిక్కిం మాజీ ముఖ్యమంత్రి పవన్ కుమార్ చామ్లింగ్ పేరిట ఉన్న ఈ రికార్డును మోదీ అధిగమించారు. చామ్లింగ్ సిక్కిం ప్రభుత్వ అధిపతి (ముఖ్యమంత్రి)గా 8,930 రోజులు పనిచేశారు.

2001లో గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన మోదీ 2014లో ప్రధానమంత్రి అయ్యే వరకు ఆ పదవిలో ఉన్నారు. అప్పటినుంచి నేటి వరకు ప్రధానిగా కొనసాగుతున్నారు.

గుజరాత్‌కు అత్యధిక కాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తిగా మోదీ నిలిచారు. అంతే కాకుండా ముఖ్యమంత్రిగా ఎక్కువ అనుభవమున్న ప్రధాని కూడా ఆయనే.

స్వాతంత్ర్యానంతరం జన్మించి, దీర్ఘకాలం ప్రధానిగా ఉన్న కాంగ్రెసేతర తొలి నేత కూడా మోదీయే. కేంద్రంలో రెండుసార్లు పూర్తి పదవీకాలాన్ని పూర్తిచేసుకొని, మూడోసారి అధికారం చేపట్టిన కాంగ్రెసేతర పార్టీ నేతగా రికార్డు నెలకొల్పారు.

వరుసగా 2014, 2019, 2024 లోక్‌సభ ఎన్నికల్లో తన పార్టీని మోదీ విజయపథంలో నడిపించారు. దీంతో మూడు లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి విజయాన్ని సాధించిన నెహ్రూ రికార్డును సమం చేశారు.

గతేడాది జులైలో మోదీ.. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ రికార్డును అధిగమించి వరుసగా దేశంలో అత్యధిక కాలం పనిచేసిన రెండో ప్రధానిగా నిలిచారు.

వరుసగా ఆరు ఎన్నికల్లో ఒక పార్టీ పక్ష నేతగా ఎన్నికైన ఏకైక నేత నరేంద్రమోదీ. 2002, 2007, 2012లలో గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో నెగ్గి సీఎం అయ్యారు. 2014, 2019, 2024 సార్వత్రిక ఎన్నికల్లో నెగ్గి ప్రధాని అయ్యారు.

# లారీని ఢీకొట్టిన కారు.. భార్యాభర్తలు మృతి

మొదటిపేజీ తరువాయి

పూతలపట్టు: చిత్తూరు జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతిచెందారు. చిత్తూరు-తిరుపతి హైవేపై ఆదివారం వేకువజామున ఈ ఘటన చోటుచేసుకుంది. ముందువెళుతున్న లారీని వెనుక నుంచి కారు ఢీకొట్టింది. దీంతో కారులోని భార్యాభర్తలు సతీశ్, భాగ్యలక్ష్మి అక్కడికక్కడే మృతిచెందారు. అదే కారులో ప్రయాణిస్తున్న కుమారుడు సుశాంత్, కుమార్తె పావని, డ్రైవర్ ప్రదీప్ సురక్షితంగా బయటపడ్డారు. కర్ణాటకలోని మండ్యకు చెందిన వీరంతా తిరుమలకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

## శత్రు నౌకలు మినహా అన్నీ వెళ్లొచ్చు! - ఇరాన్



హర్మూజ్ జలసంధిని 48 గంటల్లోగా తెరవాల్సిందేనని, లేదంటే విద్యుత్ కేంద్రాలపై దాడులు చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలపై ఇరాన్ స్పందించింది. శత్రు దేశాలకు చెందినవి మినహా అన్ని నౌకలు తమతో సమన్వయం చేసుకుంటూ హర్మూజ్ ద్వారా వెళ్లొచ్చని పేర్కొంది. ఈ మేరకు ఐరాసలోని ఇంటర్నేషనల్ మారిటైమ్ ఆర్గనైజేషన్ (ఐఎంవో)లో ఇరాన్ సీనియర్ ప్రతినిధి అలీ మౌసావి ఈ విషయాన్ని వెల్లడించారు. హర్మూజ్‌లో ప్రస్తుత పరిస్థితికి అమెరికా, ఇజ్రాయెల్‌లు ప్రధాన కారణమని మౌసావి ఆరోపించారు. దౌత్యానికి ఇరాన్ అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని, అయినప్పటికీ.. దురాక్రమణ నిలిపివేయడం, పరస్పర విశ్వాసం ఎంతో ముఖ్యమన్నారు. నావికుల రక్షణ, సముద్ర భద్రతను మెరుగుపరచడానికి ఐరాస విభాగమైన ఐఎంవోకు సహకరించేందుకు ఇరాన్ సిద్ధంగా ఉందన్నారు. ఇదిలాఉంటే, హర్మూజ్ జలసంధిని పూర్తిగా తెరవకుంటే.. ఇరాన్‌లోని పలు విద్యుత్ కేంద్రాలను లక్ష్యంగా చేసుకుంటామని ట్రంప్ హెచ్చరించారు. అతిపెద్ద విద్యుత్ కేంద్రంతోనే ఈ దాడులు ఆరంభిస్తామని ప్రకటించిన నేపథ్యంలో ఇరాన్ నుంచి ఈ స్పందన రావడం గమనార్హం.

# సిద్దిపేటలో గెలిచిన వారికి మంత్రి పదవి: సీఎం రేవంత్‌రెడ్డి

మొదటిపేజీ తరువాయి

రియల్ ఎస్టేట్ వ్యాపారం వల్ల ఆ జిల్లాలో పంటల సాగు తగ్గింది. కూరగాయలు, పండ్లు ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. కేంద్రం 50 లక్షల టన్నుల వరి మాత్రమే కొంటామని చెప్తోంది. పంటమార్పిడి ద్వారా మాత్రమే.. వ్యవసాయం లాభసాటి అవుతుంది.

### అంకాపూర్‌ను ఆదర్శంగా తీసుకోండి

సిద్దిపేటలో నిర్మించిన ఫ్యాక్టరీ కొడంగల్‌లోనూ నిర్మించాలని మంత్రి తుమ్మలకు విజ్ఞప్తి చేస్తున్నా. నిజామాబాద్ జిల్లాలోని అంకాపూర్ రైతులను ఆదర్శంగా తీసుకొని రైతులంతా ముందుకెళ్లాలి. తెలంగాణలో ఒక్కో జిల్లా.. ఒక్కో పంటకు ప్రసిద్ధి. రాష్ట్రంలో సారవంతమైన భూములున్నాయి.. కష్టపడే రైతులు ఉన్నారు. మన పంటలను ఎగుమతి చేసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోంది. రాష్ట్రంలో కోటిమంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలని నిర్ణయించాం. మహిళలను వ్యాపారులుగా తీర్చిదిద్దుతున్నాం. ఒకప్పుడు సౌరవిద్యుత్ వ్యాపారం అంబానీ, అదానీ వంటివారు చేసేవారు. ఈ ప్రభుత్వం మహిళలతో సోలార్‌ప్లాంట్లను ఏర్పాటు చేయించింది. ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ నుంచే ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టాం. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంతో పాటు.. ఉదయం టిఫిన్ కూడా పెడుతున్నాం.

### సిద్దిపేటలో గెలిచిన వారికి మంత్రి పదవి

పశ్చిమాసియాలో యుద్ధం వల్ల మనకు రాబోయే రోజుల్లో యూరియా కొరత వచ్చేలా ఉంది. రామగుండం ఫ్యాక్టరీ యూరియా అంతా మనకే దక్కేలా భాజపా ఎంపీలు సహకరించాలి. ఎన్నికలు ఉన్నప్పుడే రాజకీయాలు చేద్దాం. ఎన్నికలు లేనప్పుడు ప్రాంతాల అభివృద్ధి కోసం పరస్పరం సహకరించుకోవాలి. ప్రత్యర్థి పార్టీ నేతల గురించి ఆలోచిస్తే.. ప్రజలకు అన్యాయం జరుగుతుంది. ప్రజలకు ఇచ్చే నిధుల విషయంలో వివక్షచూపే సీఎంను కాదు. వచ్చే ఎన్నికల్లో సిద్దిపేటలోనూ కాంగ్రెస్ గెలవాలి. ఇక్కడి నుంచి గెలిచిన వ్యక్తికి మంత్రి పదవి ఇస్తా. గత పాలకులు విపక్షనేతల నియోజకవర్గాల పట్ల వివక్ష చూపించారు. నేను నేతలతో వ్యతిరేకిస్తాను గానీ, ప్రజల పట్ల వివక్ష చూపను. సిద్దిపేటకు కూడా నిధులు భారీగా ఇచ్చాను. వివక్ష చూపే వ్యక్తినయితే.. ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని కొడంగల్‌కు తీసుకెళ్లేవాడిని. ప్రజలు బీఆర్ఎస్‌కు రెండుసార్లు అధికారం ఇచ్చారు.. మాకు రెండు సార్లు ఇస్తారు." అని రేవంత్ అన్నారు.

అంతకుముందు సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెటలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. 62 ఎకరాలకుపైగా విస్తీర్ణంలో రూ.300 కోట్లతో ఈ ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టారు. మరోవైపు రూ.80 కోట్లతో నర్మెటలో పామాయిల్ రిఫైనరీ ప్లాంట్ నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు.

# హైదరాబాద్‌ను మించేలా అమరావతి నిర్మాణం

మొదటిపేజీ తరువాయి

1999-2004 మధ్య హైదరాబాద్‌ను శరవేగంగా అభివృద్ధి చేశాం. అప్పట్లో నేను కృషి చేయడం వల్లే జినోమ్ వ్యాలీ వచ్చింది. అనేక కారణాల వల్ల 2004లో ఓడిపోయాం. మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు పదేళ్లు పట్టింది. 2014 నుంచి 2019 వరకు ఏపీలో అనేక కార్యక్రమాలు చేపట్టాం. కేవలం అభివృద్ధిపైనే దృష్టి పెడితే ఎన్నికల్లో గెలవలేం. 2019 నుంచి 2024 మధ్య ఏపీలో అభివృద్ధి కుంటుపడింది. 2024లో మళ్లీ వచ్చాక అభివృద్ధి, సంక్షేమం అందిస్తున్నాం. ఇప్పుడు అనేక రంగాల్లో ఏపీ అగ్రస్థానంలో ఉంది. 30 ఏళ్ల క్రితమే ఐటీ గురించి ఆలోచించా. ఏఐ, డేటా సెంటర్లు, క్వాంటమ్, స్పేస్ టెక్నాలజీ వచ్చాయి. డ్రోన్లు, ఎయిర్ అంబులెన్స్‌లు త్వరగా విస్తరిస్తున్నాయి. ప్రస్తుత యుద్ధాల్లో డ్రోన్ టెక్నాలజీ ఎలా ఉందో చూస్తున్నాం. విద్యుత్ సమస్యలను అధిగమించి మిగులు వరకు తీసుకొచ్చాం. సోలార్, విండ్, గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహిస్తున్నాం. గ్రీన్ ఎనర్జీరంగంలో దక్షిణాదిలో మేమే నెంబర్‌వన్ " అని చంద్రబాబు అన్నారు.

# ఆర్సెల్లార్ మిత్తల్ స్టీల్‌ప్లాంట్.. ఉత్తరాంధ్రకు మరో మణిహారం: కలిశెట్టి

మొదటిపేజీ తరువాయి

అమరావతి: ఉత్తరాంధ్రలో అతిపెద్ద గ్రీన్‌ఫీల్డ్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కాబోతోందని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. రూ.1.05 లక్షల కోట్లతో ఏర్పాటు కాబోతున్న ఆర్సెల్లార్ మిత్తల్ స్టీల్‌ప్లాంట్‌కు సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేయబోతున్నట్లు చెప్పారు. ఆర్సెల్లార్ మిత్తల్ స్టీల్‌ప్లాంట్ ఉత్తరాంధ్రకు మరో మణిహారంగా నిలుస్తుందన్నారు. వైకాపా పాలనలో ఉత్తరాంధ్రను నిర్లక్ష్యం చేశారని, సీఎం చంద్రబాబు 20 నెలల్లో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి చూపించారని చెప్పారు. ఉత్తరాంధ్ర ద్రోహిగా జగన్ నిలిచిపోయారని విమర్శించారు.

# 25న కాంగ్రెస్‌కు రాజీనామా చేస్తా: జీవన్‌రెడ్డి

మొదటిపేజీ తరువాయి

జగిత్యాల: కాంగ్రెస్‌లో కొనసాగలేనంటూ జగిత్యాల కార్యకర్తలకు సీనియర్ నేత టి. జీవన్‌రెడ్డి లేఖ రాశారు. ఈ నెల 25న కాంగ్రెస్‌కు రాజీనామా చేస్తానని అందులో పేర్కొన్నారు. గత 20 నెలలుగా పార్టీలో మానసిక క్షోభకు గురవుతున్నానని తెలిపారు. అవమానాలు భరిస్తూ పార్టీలో కొనసాగలేనని చెప్పారు. స్థానిక నేతలు, కార్యకర్తలతో సమావేశమై, అందరి సలహాలు, సూచనలతో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని లేఖలో పేర్కొన్నారు. 'నా రాజకీయ ప్రస్థానంలో మీ తోడు, మార్గదర్శనం కావాలి' అని కార్యకర్తలను కోరారు.


# హైదరాబాద్‌లో బాల్కనీ స్లాబ్ కూలి ఇద్దరి మృతి

మొదటిపేజీ తరువాయి

కుందన్ బాగ్ మెథడిస్ట్ కాలనీలోని శ్రీవాత్స అపార్ట్‌మెంట్ యజమాని ద్వారకాప్రసాద్ పనుల నిమిత్తం వారిని తన ఇంటికి పిలిపించాడు. ముగ్గురూ కలిసి మూడో అంతస్తుకు చేరుకొని పనుల గురించి మాట్లాడుతుండగా.. ఒక్కసారిగా బాల్కనీ స్లాబ్ కూలిపోయింది. దీంతో ముగ్గురూ కింద పడిపోయారు. దేవీదాస్, వివేక్ అక్కడికక్కడే మృతిచెందారు. ఇంటి యజమాని ద్వారకా ప్రసాద్ తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# మమత కంచుకోట.. ఒకప్పుడు కాంగ్రెస్‌దే హవా!

మొదటిపేజీ తరువాయి



కారణం.. ఇది ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సొంత నియోజకవర్గం కావడమే. పైగా ఈసారి భాజపా నేత సువేందు అధికారి సైతం ఇక్కడినుంచే పోటీకి దిగనున్నారు. ప్రస్తుతం దీదీకి కంచుకోటగా పేరున్న ఈ నియోజకవర్గంలో ఒకప్పుడు కాంగ్రెస్‌దే హవా. స్వాతంత్ర్యం అనంతరం దశాబ్దాలపాటు ఇక్కడ హస్తం పార్టీ నేతలదే పైచేయి.

బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి సిద్ధార్థ శంకర్ రే.. భవానీపూర్ నుంచి కాంగ్రెస్ తరపున పోటీ చేసి గెలుపొందారు. మరోసారి స్వతంత్ర అభ్యర్థిగానూ ఆయన విజయం సాధించడం గమనార్హం. మీరాదత్తా గుప్తా, రథిన్ తాలుక్‌దార్ వంటి కాంగ్రెస్ దిగ్గజాలు కూడా ఈ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు.

అనేక సంవత్సరాలపాటు కాంగ్రెస్ ఆధిపత్యం కొనసాగిన ఈ నియోజకవర్గం పేరును కాళీఘాట్‌గా మార్చారు. 1969 ఎన్నికల్లో సీపీఎం నేత సాధన్ గుప్తా గెలుపొందారు.

1972లో నియోజకవర్గాల పునర్విభజన అనంతరం.. ఈ నియోజకవర్గం కనుమరుగైపోయింది. మళ్లీ 2011లో డీలిమిటేషన్ తర్వాత భవానీపూర్ పేరిట పునర్వ్యవస్థీకరించారు. అదే ఏడాది జరిగిన శాసనసభ ఎన్నికల్లోనే బెంగాల్‌లో వామపక్షాల సుదీర్ఘ పాలనకు తెరదించుతూ టీఎంసీ అధికారంలోకి వచ్చింది. భవానీపూర్‌లో దీదీ విశ్వాసపాత్రుడు సుబ్రతా బక్షీ గెలుపొందారు కొద్దికాలానికే బక్షీ ఆ సీటును ఖాళీ చేశారు. అప్పటికే ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన మమతా బెనర్జీ.. ఇదే స్థానం నుంచి ఉప ఎన్నికలో గెలుపొంది అసెంబ్లీలో అడుగుపెట్టారు. అప్పటినుంచి ఈ సీటు తృణమూల్ చేతుల్లోనే ఉంది. 2016లోనూ మమత 65 వేలకుపైగా ఓట్లతో విజయం సాధించారు.

పాలనలో.. మోదీ రికార్డు

2021లో నందిగ్రామ్ నుంచి పోటీ చేసిన మమత.. సువేందు అధికారి చేతిలో 1,956 ఓట్ల తేడాతో ఓడిపోయారు. భవానీపూర్‌లో మాత్రం టీఎంసీ అభ్యర్థి సోవందేబ్ ఛటోపాధ్యాయ విజయం సాధించారు. ఆయన రాజీనామా చేసిన అనంతరం జరిగిన ఉప ఎన్నికలో 58 వేలకుపైగా ఓట్ల మెజారిటీతో మమతా విజయం సాధించారు.

దక్షిణ కోల్‌కతాలోని ఈ అసెంబ్లీ నియోజకవర్గం సామాజిక వైవిధ్యానికి ప్రతిబింబంగా నిలుస్తోంది. ఇక్కడ బెంగాలీ మధ్యతరగతి కుటుంబాలతోపాటు పెద్ద సంఖ్యలో హిందీ మాట్లాడే వ్యాపార వర్గాలూ ఉన్నాయి. ఓటర్లలో బెంగాలీ హిందువులు దాదాపు 42 శాతం, బెంగాలీయేతర హిందువులు 34 శాతం, ముస్లింలు 24 శాతం ఉన్నారు. నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలతో సీఎం మమతా బెనర్జీ వ్యక్తిగత రాజకీయ అనుబంధాన్ని ఏర్పరచుకున్నారని, స్థానిక సామాజిక వాతావరణం ఆమెకు అనుకూలంగా ఉందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

# విశేష అలంకరణలో శ్రీ నూకాలమ్మ దర్శనం

- దేవస్థానంలో ముగిసిన ఉగాది జాతర మహోత్సవాలు.
- ధన్యవాదాలు తెలిపిన డాక్టర్ రాజాన సత్యనారాయణ (పండు)
- శ్రీ నర్మదా అమృత బాణ లింగేశ్వర స్వామి వారికి సోమవారం సందర్భంగా పంచామృత అభిషేకాలు

గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంచార్జ్ బి ప్రభాకర్

జంగారెడ్డిగూడెం పట్టణంలోని శ్రీనూకాలమ్మ అమ్మవారు సోమవారం విశేష అలంకరణలో దర్శనమిచ్చారు.ఆలయ శాశ్వత చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ (పండు) మాట్లాడుతూ,అమ్మ వారి అనుగ్రహంతో 62వ ఉగాది వార్షిక జాతర మహోత్సవాలు అత్యంతవైభవంగా పూర్తి చేయడం జరిగిందన్నారు.ఈ సందర్భంగా సహకరించిన దాతలకు, ఆలయ కమిటీ సభ్యులకు, తాండ్ర పాపారాయుడు యూత్ సభ్యులకు, శ్రీ నూకాంబిక సేవా బృందం సభ్యులకు, పట్టణ ప్రముఖులకు,పాత్రికేయులకు, ప్రింట్ మీడియా వారికి, ఎలక్ట్రానిక్ మీడియా వారికి, ధన రూపంలోనూ వస్తురూపంలోనూ, సేవా రూపంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన ప్రతీ ఒక్కరికీ పేరు పేరున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.అయ్యప్ప టిప్ టాప్ వాసు కి, రవి స్వీట్స్ అప్పారావుకి, భక్తఆంజనేయస్వీట్స్ గుబ్బల రాంబాబుకి, ఫ్రూట్స్ షాప్ స్వామీకి, పులకొట్టు భద్రాచలం సత్యనారాయణ, వాసుకి,కోలాటాలు, భజనలు, లలిత పారాయణలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు చేసిన వారికి,



బొమ్మలతో డెకరేషన్ చేసిన బాలకృష్ణ తదితరులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రొంగల నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి చిటికెన రాంబాబు, ఆలయ కమిటీ సభ్యులు పోలుపర్తి రాము, చింతకాయల అచ్చిరాజు, జి వీ కే ఎస్ రాజు, షేక్ షాను,గ్రామ భక్త మహా జనులు పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేశారు.ఆలయ కళ్యాణ కళా వేదిక వద్ద, శ్రీ నర్మదా అమృత బాణ లింగేశ్వర స్వామి వారి పంచలోహ ఉత్సవలింగానికి సోమవారం సందర్భంగా పంచామృతాభిషేకాలను అర్చక స్వాములు నిర్వహించారు.భక్తులైన తామెల్లరు తప్పనిసరిగా విచ్చేసి ఈ కార్యక్రమంలో పాల్గొని, అమ్మ వారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించి అమ్మ వారి అనుగ్రహానికి పాత్రులు కావాలని తెలిపారు.భక్తులు ఇతోధికంగా వెండి రూపంలో, ధన రూపంలోనూ ,పాత వెండి వస్తువులు అమ్మ వారి వెండి చీర తయారీకి సమర్పించి అమ్మ వారి అనుగ్రహానికి పాత్రులు కావాలని అన్నారు.

# తాగునీరు,సాగునీరు కోసం ప్రణాళికలు సిద్ధం

గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంచార్జ్ బి ప్రభాకర్

దెందులూరు నియోజకవర్గంలోని రైతులకు 365 రోజుల పాటు సాగునీరు అందించడమే తన జీవితానికి సార్థకత అని - అందుకోసమే రూ.280 కోట్ల రూపాయలు వెచ్చించి పోలవరం రైట్ కెనాల్ ద్వారా అనేక గ్రామాలకు ఇంటింటికి త్రాగు నీటితో పాటు సాగునీరు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని, రాబోయే సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తో చర్చించి వారి సహకారంతో , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో ఈ బృహత్తర ప్రాజెక్టును పూర్తి చేసి దెందులూరు నియోజకవర్గం లోని రైతాంగానికి సుభిక్షంగా సాగునీరు అందించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు.



పెదవేగి మండలం దిబ్బ గూడెం, లక్ష్మీపురం, న్యాయంపల్లి , మొందూరు గ్రామాల్లోని పోలవరం రైట్ మెన్ కెనాల్ పరివాహక పలు గ్రామాల్లో సోమవారం ఉదయం దెందులూరు ఎమ్మెల్యే,నీటిపారుదల శాఖ ,గ్రామీణ నీటి సరఫరాల శాఖ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి నూతనంగా చేపట్టబోతున్న ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో పోలవరం ప్రాజెక్టు రైట్ మెన్ కెనాల్ నిర్మాణం చేపట్టినప్పుడు పెదవేగి మండలంలోని దిబ్బగూడెం పంచాయతీ రెండు ముక్కలుగా విడిపోయిందని, మొదట్లో జరిగిన ప్రణాళికల్లో ఈ అంశాలు లేకపోయినప్పటికీ కూడా అప్పట్లో రైతులందరినీ ఒప్పించి హైకోర్టులో ఉన్న కేసులను విత్ డ్రా చేయించి ఆనాటి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో మంజూరు చేయడం జరిగిందని, అదేవిధంగా ఈ రెండు గ్రామాలకు బ్రిడ్జిలు కూడా మంజూరు చేసి నిర్మాణం చేస్తామని అనాడు హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు. అయితే దురదృష్టవశాత్తు 2019లో ప్రభుత్వం మారినప్పుడు అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వల్ల ఈ ప్రాజెక్టు పూర్తిగా నిర్వీర్యం అయిందని ప్రాజెక్టుతో పాటు లిఫ్టు పనులు గాని బ్రిడ్జి నిర్మాణ పనులు గాని కెనాల్ పనులు గాని ముందడుగు వేయక ప్రాజెక్టు లక్ష్యం నెరవేరలేదని తెలిపారు.అందువల్ల కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో మరోసారి ఈ బ్రిడ్జి నిర్మాణం కి చర్యలు చేపట్టామని,ఈ వేసవిలోనే బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేపట్టి త్వరలోనే బ్రిడ్జిని కూడా ప్రారంభోత్సవం చేసే విధంగా చర్యలు చేపట్టి బ్రిడ్జిను గ్రామానికి అంకితం చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. అదేవిధంగా పెదవేగి మండలంలోని పలు గ్రామాల్లో సుదీర్ఘకాలంగా గ్రౌండ్ వాటర్ నిల్వలు తగ్గిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, వారందరికీ శాశ్వతంగా పోలవరం ప్రాజెక్టు నుంచి నీళ్లు అందించే విధంగా చర్యలు చేపట్టామని తెలిపారు.

# పిజిఆర్ యస్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

- దరఖాస్తులు రీ ఓపెన్ కాకుండా నాణ్యమైన పరిష్కారం చూపాలి
- ధరఖాస్తులు పరిష్కారంలో అలసత్వం, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు
- జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి

గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంచార్జ్ బి ప్రభాకర్

జిల్లా కలెక్టరేట్ లోని గోదావరి సమావేశ మందిరంలో సోమవారం జిల్లా స్థాయి ప్రజాసమస్యలు పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లాస్థాయి అధికారులతో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి నిర్వహించారు. జిల్లా కలెక్టరుతో పాటు జాయింట్ కలెక్టర్ డా.ఎం.జె. అభిషేక్ గౌడ, ఇంచార్జ్ జిల్లా రెవెన్యూ అధికారి భాస్కర్, ఎస్సీ కార్పొరేషన్ ఇడి యం.ముక్కంటి, సర్వే శాఖ ఏడి అన్సారీ, తదితరులు వినతులను స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ పిజిఆర్ యస్ లో అందిన ప్రతి అర్జీ ని పరిశీలించి, వాటిలో తెలియజేసిన విషయాలపై క్షేత్రస్థాయిలో విచారణ చేసి, నిబంధనల మేరకు పరిష్కరించాలన్నారు. పిజిఆర్ యస్ లో అందిన ప్రతి అర్జీ రీఓపెన్ కాకుండా నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పిజిఆర్ యస్ లో అందిన దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నదని , కావున అధికారులు క్షేత్రస్థాయిలో ఉత్పన్నమయ్యే సమస్యలకు క్షేత్రస్థాయిలోనే పరిష్కారం చేసి అర్జీలు



రీఓపెన్‌కు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. భూ సమస్యలు రెవిన్యూ క్లినిక్ ద్వారా పరిష్కరించుకోవాలని కోరారు.సోమవారం పిజిఆర్ఎస్ కార్యక్రమంలో 358 అర్జీలు అందాయి.కామవరపుకోట మండలం జలపావారిగూడెం నకు చెందిన బాడిపట్ల సుబ్బమ్మ తన దరఖాస్తులో నా కుమారుడుకి నా భూమి ని ఇచ్చానని, తన భూమిని తీసుకుని తన పోషణ చూడడంలేదని, కొడుకు, కోడలు తనపై దౌర్జన్యం చేస్తున్నారని వాపోయింది. తనకు న్యాయం చేయాలనీ కోరగా,వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జంగారెడ్డిగూడెం మండలం చక్రదేవరపల్లి గ్రామానికి చెందిన కాజా సత్తమ్మ తనకు వృద్ధ్యాప్యపు పెన్షన్ మంజూరు చెయ్యబలసిందిగా కోరారు. ఏలూరు మండలం కొమడవోలు కు చెందిన షేక్ జుబేదాబేగం తనకు దివ్యాంగుల పెన్షన్ మంజూరు చేయవలసిందిగా కోరారు. కొయ్యలగూడెం మండలం పరింపూడి కి చెందిన కానూరి సత్యనారాయణ తన దరఖాస్తులో తమ గ్రామంలో ప్రధాన రహదారికి వెళ్లే నాలుగు కూడలిలో అనధికారికంగా కట్టిన కల్వర్టు కారణంగా ప్రమాదాలు సంభవిస్తున్నాయని, సమస్య పరిష్కరించాల్సిందిగా కోరారు. ఏలూరు కు చెందిన భూపతి వాసంతి తమకు ఇంటి స్థలం మంజూరు చేయవలసిందిగా కోరారు. ఏలూరు తంగెళ్లమూడి కి చెందిన అలజింగి నాగరాజు తమ ప్రాంతంలో దుర్గకిషోర్ అనే వ్యక్తి ప్రభుత్వ భూమిని ఆక్రమించాడని, తొలగించాలని కోరారు. లింగపాలెం మండలం తవ్వచిలకరాయుడుపాలెం గ్రామానికి చెందిన గ్రామస్థులు తమ గ్రామంలో నిర్మిస్తున్న డ్రైన్లు నాణ్యత ప్రమాణాలు లేకుండా నాసిరకం మెటీరియల్ తో నిర్మిస్తున్నారని, తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. ద్వారకా తిరుమల మండలం దొరసానిపాడు గ్రామానికి చెందిన లక్కబట్టులా మరియమ్మ తన దరఖాస్తులో తన ఇంటిని తన కొడుకుపేరుమీదుగా రాసానని కానీ తన కొడుకు, కోడలు తమ ఇంటిని తీసుకుని తనను ఇంటినుండి తరిమివేశారని తనకు న్యాయం చేయాల్సిందిగా కోరారు. సదరు దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు పంపి నిర్ణీత సమయంలోగా పరిష్కరించి, పరిష్కార విధానాన్ని సంబంధిత దరఖాస్తుదారులకు తెలియజేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. జిల్లాలోని వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, తహసీల్దార్లు, రెవిన్యూ అధికారులు, పాల్గొన్నారు.

# పశ్చిమాసియా యుద్ధంపై సభలో ప్రధాని స్టేట్‌మెంట్



పశ్చిమాసియాలో పరిస్థితి ఆందోళనకరంగా ఉందని ప్రధాని మోదీ లోక్ సభలో మాట్లాడారు.యుద్ధంతో ప్రపంచంపై తీవ్ర ప్రభావం ఉందని, అందులో భాగంగానే భారత్‌కు ఈ యుద్ధం ఎన్నో సవాళ్లు తీసుకొచ్చిందని మోదీ చెప్పారు.గల్ఫ్‌లో కోటి మంది భారతీయులు ఉన్నారని,భారతీయులను కాపాడడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని,భారతీయుల కోసం హెల్ప్‌లైన్, కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేయడమే కాకుండా 3 లక్షల 75 వేలమందిని సురక్షితంగా భారత్‌కు తరలించామని,వారిలో ఇరాన్ నుంచి 1000 మందిని తరలించామని మోదీ తెలిపారు.ప్రజలకు పెట్రోల్, గ్యాస్ కొరత లేకుండా చూస్తున్నాం.60 శాతం న్రా+ని భారత్‌లో ఉత్పత్తి చేస్తున్నామన్నారు.41 దేశాల నుంచి ఇంధనం కొంటున్నాం,53 లక్షల మెట్రిక్ టన్నుల పెట్రోల్ నిల్వలు ఉన్నాయి,రైల్వేల విద్యుదీకరణతో 180 కోట్ల డీజిల్ ఆదాప్రపంచానికి ఆర్థికమాంద్యం ముప్పు పొంచి ఉండగా,భారత్‌పై మాంద్యం ప్రభావం లేకుండా చూస్తున్నారు.ఎలాంటి సంక్షోభాన్నైనా ఎదుర్కోవడానికి సిద్ధమని,కరోనా సమయంలోనూ ఇలాంటి సంక్షోభాన్ని ఎదుర్కొన్నామని తెలిపారు.ఖరీఫ్ సీజన్‌లో రైతులకు డీజిల్ కొరత లేకుండా చూస్తాం,పవర్‌ప్లాంట్లకు సరిపడా బొగ్గు నిల్వలున్నాయని దేశ ప్రజలకు ధైర్యం చెప్పారు.యుద్ధం ఆపడానికి ప్రతిరోజు పశ్చిమాసియాదేశాధ్యక్షులతో మాట్లాడుతున్నామని ప్రధాని మోదీ లోక్ సభ లో చెప్పారు.

# ఘనంగా దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి వేడుకలు

- వేడుకల్లో పాల్గొన్న మంత్రి నిమ్మల రామానాయుడు

గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంచార్జ్ బి ప్రభాకర్



పాలకొల్లులో మంత్రి నిమ్మల రామానాయుడు ఆధ్వర్యంలో దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.ముందుగా విగ్రహానికి పూలమాలలు సమర్పించి నమస్కరించారు.అనంతరం మంత్రి కేక్ ను కట్ చేశారు.కోనసీమలో అట్టడుగు వర్గాల విద్యాభివృద్ధికి, వారి ఆత్మగౌరవం కోసం పోరాడిన యోధుడు దొమ్మేటి వెంకటరెడ్డి అని మంత్రి కొనియాడారు.శెట్టి బలిజ సమాజంలో విద్య, ఐక్యత, ఆత్మగౌరవం కోసం విశేషంగా కృషి చేసిన గొప్ప సంస్కర్త అన్నారు.దొమ్మేటి వెంకటరెడ్డి సేవలను భవిష్యత్ తరాలకు తెలియజేసేలా ఆయన జయంతిని అధికారికంగా నిర్వహించాలని చంద్రబాబు నిర్ణయించారని తెలిపారు.యువగళం పాదయాత్రలో దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని అధికారికంగా నిర్వహిస్తామని హామీ ఇచ్చిన లోకేష్ తండ్రికి తగిన తనయుడని మంత్రి తెలిపారు. స్వాతంత్ర్య సంగ్రామంలో శెట్టిబలిజల సైన్యాన్ని సిద్ధం చేసి, పుస్తకాలు రాసి చైతన్యం తెచ్చిన వెంకటరెడ్డి జయంతి వేడుకల్లో పాల్గొనడం ఎంతో గర్వంగా ఉందని మంత్రి తెలిపారు.

# కలెక్టరేట్ లో ప్రముఖ దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి వేడుకలు

- దొమ్మేటి వెంకటరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించిన జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి

గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంచార్జ్ బి ప్రభాకర్



ప్రముఖ సంఘ సంస్కర్త దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి వేడుకలు సోమవారం ఏలూరు జిల్లా కలెక్టరేట్ లోని గోదావరి సమావేశపు హాలులో ఘనంగా నిర్వహించారు. జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి వేడుకలను జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా దొమ్మేటి వెంకటరెడ్డి చిత్రపటానికి జిల్లా కలెక్టర్ పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ దొమ్మేటి వెంకటరెడ్డి గొప్ప సంఘ సంస్కర్త ని, స్వాతంత్ర్య సంగ్రామంలో జాతీయోద్ధరణకు కృషి చేశారన్నారు. ముఖ్యంగా సమాజంలో విద్య ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేసి, ప్రజలను విద్యావంతులను చేసేందుకు ఎంతో కృషి చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని అధికారిక కార్యక్రమంగా నిర్వహించాలని ఆదేశించిందన్నారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ డా.ఎం.జె. అభిషేక్ గౌడ, ఇంచార్జ్ జిల్లా రెవెన్యూ అధికారి భాస్కర్, ఎస్సీ కార్పొరేషన్ ఇడి యం.ముక్కంటి, సర్వే శాఖ ఏడి అన్సారీ, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి ఆర్.వి. నాగరాణి, బిసి కార్పొరేషన్ ఈడి పుష్పలత, శెట్టిబలిజ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ఇళ్ల వరప్రసాద్, ఉపాధ్యక్షులు ఇళ్ల శ్రీనివాస్, జుత్తిగ శ్రీనివాస్, పంపన వెంకటరమణ, వర్కింగ్ ప్రెసిడెంట్ వాసది శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులు వనము నరసింహారావు, ట్రెజరర్ గుబ్బల దుర్గ రావు, సభ్యులు దంపబోయిన రఘు, బండి కైలాసపతి తదితరులు పాల్గొన్నారు.

# అనుదీప్ అనుమానాస్పద మృతిపై ఎస్పీకి ఫిర్యాదు

- ప్రత్యేక అధికారితో విచారణ చేపట్టాలని జనసేన వినతిపత్రం
- న్యాయం చేస్తామని ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ హామీ

గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంచార్జ్ బి ప్రభాకర్

10 రోజుల క్రితం ఏలూరు జిల్లా నూజివీడు దలం,నియోజకవర్గంలోనిచాట్రాయి లో అంబటి అనుదీప్ అనే 17 ఏళ్ల కుర్రాడి అనుమానాస్పద మృతి చెందిన నేపథ్యంలో అనేక అనుమానాలు కలిగించే విధంగా ఉన్నాయని గ్రామస్తులు ,కుటుంబ సభ్యులు ఆందోళన చేసిన



సంగతి తెలిసిందే.కాగా అనుదీప్ జనసేన పార్టీ అభిమాని అని తెలియడంతో రాష్ట్ర వ్యాప్తంగా జనసేన నాయకులు ,సైనికులు కూడా ఆందోళన చేయడం జరిగింది. మంత్రి కొలుసు పార్థసారథి, జనసేన నాయకులు మండలి రాజేష్ , నియోజకవర్గం ఇంచార్జీ బర్మా ఫణి బాబు స్థానిక నేతలు వారి కుటుంబ సభ్యులను , తల్లితండ్రులను కలిసి పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు భరోసా ఇవ్వడం జరిగింది. తదుపరి విచారణ నిమిత్తం జిల్లా ఎస్పీ తో మాట్లాడి ప్రత్యేక అధికారిని నియమించి నిష్పక్షపాతంగా విచారణ జరపాలని ఆదేశాలు ఇవ్వడం తో నేడు కుటుంబ సభ్యులు, కూటమి నాయకులు జిల్లా ఎస్పీ ని కలిసి పూర్తి వివరాలు తెలిపారు. వారికున్న అనుమానాలు అలానే స్థానిక పోలీసుల పనితీరు మీద ఎస్పీ కి తెలిపిన వారిలో విజయవాడ ఆర్టీసీ జోనల్ చైర్మన్,ఏలూరు జనసేన పార్టీ ఇంచార్జీ రెడ్డి అప్పలనాయుడు,పాటు చాట్రాయి మండల టీడీపీ అధ్యక్షుడు ఇజ్జగాని వెంకటేశ్వర రావు, జనసేన పార్టీ నాయకులు తుమ్మల జగన్ , జితేంద్ర, పాశం నాగబాబు ,ఏడుకొండలు, అంబటి గోపి, చంటి, సత్యనారాయణ , శేఖర్, విజయ్, ఈశ్వర్ తో పాటు కుటుంబ సభ్యులు ఉన్నారు.

# ప్రజల సమస్యల

## పరిష్కారమే ప్రథమ ప్రాధాన్యత

**– ఏలూరు జిల్లా ఎస్పీ శ్రీ కె. ప్రతాప్ శివ కిషోర్ ఐపీఎస్ వెల్లడి**



గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంచార్జ్ బి ప్రభాకర్
ప్రజల ఫిర్యాదు లను త్వరితగతిన, పారదర్శకమైన పద్ధతి లో పరిష్కరించడమే లక్ష్యంగా ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాల యంలో సోమవారం ప్రజా సమస్యల పరి ష్కార వేదిక' కార్య క్రమం నిర్వహించిన కార్యక్రమములో ఏలూ రు జిల్లా ఎస్పీ శ్రీ కె. ప్రతాప్ శివ కిషోర్ స్వయంగా బాధితుల నుండి అర్జీలను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసు కున్నారు.ఈ కార్యక్రమంలో ఎస్పీ,అదనపు ఎస్పీ అడ్మిన్ ఎన్. సూర్య చంద్ర రావు పాల్గొని ఫిర్యాదుదారులతో మాట్లాడారు.ఈ ప్రక్రియ అంతా పేపర్ లెస్ పద్ధతిలో పూర్తి పారదర్శకమైన ఆన్‌లైన్ విధానంలో సాగింది.నేడు అందిన ఫిర్యాదులలో అధికంగా భూ వివాదాలు, కుటుంబ కలహాలు,ఆర్థిక మోసా లకు సంబంధించినవి ఉన్నాయి.సోమవారం అందిన మొత్తం పిర్యాదులు 43 కాగా వీటిపై చట్ట ప్రకారం తక్షణమే విచారణ చేపట్టి, నివేదికలు సమర్పించాలని సంబంధిత పోలీసు అధికారులతో జిల్లా ఎస్పీ వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడి ఆదేశాలు ఇచ్చారు.

ప్రజలకు ఎస్పీ సూచనలు ప్రజలు తమ సమ స్యల కోసం జిల్లా కార్యాల యం వరకు వచ్చి సమయం, డబ్బు వృథా చేసుకోకుండా ఈ క్రింది మార్గాలను ఉప యోగించుకోవాలని ఎస్పీ సూచిం చారు. స్థానిక కార్యా లయాలు సబ్-డివిజన్, సర్కిల్ కార్యా లయాల్లో నేరుగా ఫిర్యాదు చేయవచ్చని. ఆన్‌లైన్ ఫిర్యాదులు ఎవవఎశీయిఎ.ఖజూ.స్ట్రశీజ.అఅ వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదులను నమోదు చేయవచ్చని సూచించారు.ఫిర్యాదుల స్థితిగతులను తెలుసుకోవడానికి 1100 టోల్-ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయవచ్చన్నారు.దూర ప్రాంతాల నుండి ఫిర్యాదుల కోసం పోలీస్ కార్యాల యానికి వచ్చిన సామాన్య ప్రజల సౌకర్యార్థం శ్రీ సత్యసాయి బాబా ట్రస్ట్ వారు ఉచిత భోజన సదుపాయం కల్పించారు.

# ది క్రౌన్ ఆఫ్ ఏలూరు అందాల పోటీలు

**– ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏపీఎస్ఆర్టీసీ జోన్ 2 చైర్మన్ రెడ్డి అప్పల నాయుడు**



గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంచార్జ్ బి ప్రభాకర్
ది క్రౌన్ ఆఫ్ ఏలూరు 2026 రాష్ట్ర స్థాయి అందాల పోటీలు (ట్రేడీషనల్ ఫ్యాషన్ షోను) సోమవారం ఏలూరులోని కొత్త బస్టాండ్ ప్రాంగణంలో ఉల్లాసభరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ ఈవెంట్ కు స్పాన్సర్లుగా ఎస్.ఆర్.కే బైక్స్ వారు వ్యవహరిస్తున్నారు. ముఖ్య అతిథిగా ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్, ఏలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జీ శ్రీ రెడ్డి అప్పల నాయుడు హాజరయ్యారు. తొలుత ఆయనకు ఘన స్వాగతం లభించింది. అనంతరం 2026 ట్రేడీషనల్ ఫ్యాషన్ షో అందాల పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పల నాయుడు మాట్లాడుతూ ఇప్పటివరకు ఎవరు కూడా ఇటువంటి కార్యక్రమాన్ని ఏలూరులో చేయలేదని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ఎంతో ఘనంగా ఆహ్లాద భరితమైన వాతావరణంలో నిర్వహిస్తున్న ఆర్గనైజర్ ఎండానా ప్రియాకి, డైరెక్టర్ సతీష్ అడ్డాలకి అభినందనలు తెలిపారు. ఈ ఫ్యాషన్ షో ద్వారా ప్రతిభావంతులైన యువతీ యువకులు పాల్గొని వారికి తమ టాలెంట్ ను ప్రదర్శించుకునే మంచి వేదికను అందించడమే ఈ ట్రేడీషనల్ ఫ్యాషన్ షో వారి లక్ష్యం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. నిర్వాహకులు ఎండానా ప్రియా, అడ్డాల సతీష్ మాట్లాడుతూ మా ఆహ్వానాన్ని మన్నించి ఈ ఈవెంట్ కు ముఖ్య అతిథిగా హాజరైన రెడ్డి అప్పల నాయుడుకి ప్రత్యేకమైన ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఈవెంట్ ను విజయవంతం చేయడానికి మా టీం మొత్తం కృషి చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు, కో డైరెక్టర్లు, క్రౌన్ ఆఫ్ ఏలూరు టీమ్ సభ్యులు, పలువురు విశిష్ట అతిధులు, నగర ప్రముఖులు, ప్రధాన స్పాన్సర్లు పాల్గొన్నారని తెలిపారు.

# ఇంటి పన్ను వసూలు వేగవంతం చేయాలి

**– డిడిఓ కె శ్రీనివాసరెడ్డి**






గాయత్రి వార్తలు
మండలంలోని గ్రామపంచాయతీలలో ఇంటి పన్ను వసూలు కార్యక్రమంను వేగవంతం చేయాలని డీడీఓ మరియు మండల స్పెషల్ ఆఫీసర్ కె. శ్రీనివాసరెడ్డి అన్నారు మండల కేంద్రంలోని సి ఎస్ పురం పంచాయతీ పరిధిలో జరుగుతున్న వసూలు పనులను సోమవారం ప్రత్యక్షంగా పరిశీలించిన అనంతరం పురోగతిపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలో మొత్తం 2185 అసెస్మెంట్లకు గాను రూ.18.47 లక్షలు వసూలు చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 1558 అసెస్మెంట్లకు గాను రూ.13.82 లక్షలు వసూలు చేసి ఆన్లైన్లో జమ చేసినట్లు తెలిపారు. ఇంకా 627 అసెస్మెంట్లకు సంబంధించిన రూ.4.65 లక్షలు పెండింగ్లో ఉన్నాయని పేర్కొన్నారు. మొత్తం వసూలులో 73.90 శాతం మాత్రమే సాధించబడిందని, మిగతా బకాయిల వసూలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పెండింగ్ బకాయిలను పూర్తిగా వసూలు చేయడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గ్రామంలోని ప్రతి వార్డు, ప్రతి ఇంటికి వెళ్లి పన్నుల వసూలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ నెల 25వ తేదీ నాటికి 100 శాతం వసూలు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఇంటి పన్నులు గ్రామాభివృద్ధికి ముఖ్యమైన ఆదాయ వనరని పేర్కొన్న ఆయన, వసూలు ప్రక్రియలో ఎలాంటి అలసత్వం ఉండకూడదని హెచ్చరించారు. ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవో సమన్వయంతో సిబ్బందితో పని చేయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు ప్రతిరోజు లక్ష్యాలు నిర్దేశించి వాటిని సాధించే విధంగా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు అదేవిధంగా సిబ్బంది ఇళ్లకు వెళ్లి అవగాహన కల్పించి పనులు చెల్లించడం ప్రతి ఒక్కరి బాధ్యతని తెలియజేస్తూ ఇంటింటికి వెళ్లి వసూలు చేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎల్ బ్రహ్మయ్య, డిప్యూటీ ఎంపీడీవో బ్రహ్మ రెడ్డి, పంచాయతీ డెవలప్మెంట్ ఆఫీసర్ మరియు స్వర్ణ గ్రామ సిబ్బంది పాల్గొన్నారు

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజా దర్బార్ లక్ష్యం

**– ప్రజల కష్టాలకు తక్షణ పరిష్కారం...**





గాయత్రి వార్తలు
గిద్దలూరు నియోజకవర్గ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి సత్వర పరిష్కారం చూపడమే లక్ష్యంగా గిద్దలూరు నియోజకవర్గ శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి సోమవారం నాడు గిద్దలూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. గిద్దలూరు నియోజకవర్గంలోని వివిధ మండలాల నుండి, గ్రామాల నుండి పెద్ద ఎత్తున తరలివచ్చిన ప్రజల వద్ద నుండి శాసనసభ్యులు స్వయంగా అర్జీలను స్వీకరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న వ్యక్తిగత సమస్యలతో పాటు, గ్రామాలలోని మౌలిక వసతుల సమస్యలను ఆయన సావధానంగా విన్నారు. సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి, అర్జీలపై సానుకూలంగా స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తీర్చడమే ఈ ప్రజా దర్బార్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ప్రతి ఫిర్యాదును పరిష్కరించే వరకు పర్యవేక్షిస్తామని హామీ ఇచ్చారు.

# మంగళగిరి టిడిపి కేంద్ర కార్యాలయంలో క్లస్టర్ ఇంచార్జీల శిక్షణ పాల్గొన్న కనిగిరి నియోజకవర్గ ప్రతినిధులు



గాయత్రి వార్తలు
తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, యువ నాయకులు నారా లోకేష్ బాబు సారధ్యంలో మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహిస్తున్న క్లస్టర్ ఇంచార్జీల శిక్షణా కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగుతోంది. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఈ వర్క్ షాప్‌లో కనిగిరి నియోజకవర్గ ప్రతినిధులు చురుగ్గా పాల్గొన్నారు. కనిగిరి నియోజకవర్గ శాసనసభ్యులు మరియు ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షులు డాక్టర్ శ్రీ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి ఆదేశాల మేరకు, నియోజకవర్గ పరిధిలోని 9 క్లస్టర్లకు చెందిన ఇంచార్జీలు ఈ శిక్షణకు హాజరయ్యారు. ముఖ్యంగా కనిగిరి నియోజకవర్గ ముఖ్య నేతలు పులి ప్రతాప్ రెడ్డి మరియు ఏనుగంటి నాగేంద్రబాబు ఈ కార్యక్రమంలో పాల్గొని, రాబోయే రోజుల్లో అనుసరించాల్సిన పార్టీ వ్యూహాలపై నారా లోకేష్ నుంచి దిశానిర్దేశం పొందారు.

?ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, స్థానిక సమస్యల పరిష్కారంలో క్లస్టర్ ఇంచార్జీల పాత్ర, మరియు ఓటర్లతో నిరంతరం సమన్వయం చేసుకునే అంశాలపై ఈ శిక్షణలో లోతైన అవగాహన కల్పించారు. కనిగిరి అభివృద్ధి కోసం ఎమ్మెల్యే ఉగ్ర నరసింహ రెడ్డి చేస్తున్న కృషిని, పార్టీ బలోపేతానికి ఆయన తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా నేతలు గుర్తుచేశారు. లోకేష్ బాబు నాయకత్వంలో శిక్షణ పొందిన ఉత్సాహంతో కనిగిరి నియోజకవర్గంలో పార్టీని మరింత ముందుకు నడిపిస్తామని వారు ధీమా వ్యక్తం చేశారు.

# దేశ స్వాతంత్రం కోసం చిరునవ్వుతో

## ఉరి కొయ్యలను ముద్దాడిన విప్లవ కెరటం భగత్ సింగ్




గాయత్రి వార్తలు
బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన భరతమాత ముద్దుబిడ్డ, దేశ స్వాతంత్రం కోసం చిరునవ్వుతో ఉరికొయ్యలను ముద్దాడిన విప్లవ కెరటం భగత్ సింగ్ అని యుటిఎఫ్ నాయకుడు ఇర్ల కొండయ్య అన్నారు. స్థానిక సిపిఎం పార్టీ కార్యాలయంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బత్తుల జ్ఞానరాజు అధ్యక్షతన సోమవారం భగత్ సింగ్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా భగత్ సింగ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. దేశ స్వాతంత్రం కోసం 23 సంవత్సరాల వయసులోనే బ్రిటిష్ వారి నిరంకుశ రాక్షస పాలనకు చరమగీతం పాడడానికి భగత్ సింగ్ చేసిన పోరాటం ఎనలేనిదని వక్తలు అన్నారు. వందేమాతరం నినాదం చేసేవారిని కాల్చి చంపుతున్న రోజులలో నా దేహం ముక్కలైనా నా దేశాన్ని కాపాడుకుంటానని బ్రిటిష్ దొరలకు ఎదురొడ్డి పోరాడిన భగత్ సింగ్ జీవితం భారత దేశ యువతకు స్ఫూర్తి దాయకమని వారన్నారు. పార్లమెంటులో బ్రిటిష్ దొరలకు వ్యతిరేకంగా కరపత్రాలు చల్లి ఇంక్విలాబ్ జిందాబాద్, వందేమాతరం అని నినదించిన గొప్ప పోరాట యోధుడు భగత్ సింగ్ అని కొనియాడారు. దేశ స్వాతంత్ర్య సముపార్జన ధ్యేయంగా ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాటం చేసిన భగత్ సింగ్ ఆలోచనలు, ఆయన చూపిన కార్యాచరణ, మనకు తరగని స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. భగత్ సింగ్ ఆశయ సాధన కోసం విద్యార్థులు యువత నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో ప్రజాసంఘాల నాయకులు ఊసా రాజలక్ష్మి, ఎస్తి రుపతి రెడ్డి, ఎం రత్నారెడ్డి, బక్క జేసురత్నం, ఎస్ శ్రీనివాసులు రెడ్డి, ముత్యాల తిరుపతిరెడ్డి, మదన్, అంకమ రావు, బాబు, యేసు తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోల్ సంక్షోభం లో గిద్దలూరు పట్టణం...!



గాయత్రి వార్తలు
మార్కాపురం జిల్లా గిద్దలూరు లోని మూడు పెట్రోల్ బంకులు ఉండగా రెండు పెట్రోల్ బంకులలో నో స్టాక్ బోర్డు,ఒక పెట్రోల్ బంకులో మాత్రమే పెట్రోల్ ఉండటం తో గిద్దలూరు పట్టణ ప్రజలు పెట్రోల్ కోసం ఎగబడుతున్న వైనం...! గిద్దలూరులో పలు పెట్రోల్ బంకులు తాత్కాలికంగా మూతపడ్డాయి, "నో స్టాక్" బోర్డులు పెట్టారు, వాహనదారులు క్యూ కట్టారు. ప్రభుత్వ స్పందన: దేశంలో ఇంధన కొరత లేదని, సరఫరా యథావిధిగా ఉందని ప్రభుత్వం హామీ ఇచ్చింది. డీలర్ల సమస్యలు: అడ్వాన్స్ చెల్లింపుల సమస్య, సరఫరాలో అంతరాయాల వల్ల కొన్ని బంకుల్లో స్టాక్ అయిపోయింది.కారణాలు: పశ్చిమాసియా ఉద్రిక్తతల వల్ల ముడి చమురు లభ్యతలో అంతరాయాలు ఏర్పడ్డాయని తెలుస్తోంది. వదంతులను నమ్మవద్దని, ఇంధన కొరత లేదని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

**GAYATHRI VARTHALU Publisher, Editor and Owned by Maddineni Nageswara Rao,** SVN Colony, Guntur, Andhra Pradesh - 522006. PRGI Reg No - APTEL/25/A1201 .. Cell No - 7386045673 ..... Printed At SUNDAY PRINTING PRESS, SVN Colony, Guntur, Andhra Pradesh - 522006 ..Cell No - 7386045673.